సూర్య www.suryaa.com

19వ వసంతంలోకి..

www.suryaaepaper.com

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com

శుక్రవారం

20-03-2026

పేజీలు: 02





## 'ధురంధర్ 2' కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం విడుదలైన మొదటి రోజే భారత సినీ పరిశ్రమలో ఎన్నో రికార్డులను తిరగరాసింది. ట్రేడ్ వర్గాల అంచనాలను మించి, ఈ సినిమా నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.146 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించి సంచలనం సృష్టించింది. ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ద్వారా ఎన్నో భారీ చిత్రాల రికార్డులను ఇది అధిగమించింది. 'ధురంధర్ 2' ప్రభంజనం బుధవారం సాయంత్రం వేసిన ప్రీమియర్ షోలతోనే మొదలైంది. ప్రీమియర్ల ద్వారానే ఈ చిత్రం ఇండియాలో దాదాపు రూ.43 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. భారతీయ సినిమాలో ప్రీమియర్ల ద్వారా అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది సరికొత్త రికార్డు నెలకొల్పింది.



## 7వేలు తగ్గిన బంగారం ధర

బంగారం కొండ దిగుతున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ పడిపోవడం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరింత ముదురుతుండటం, అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ తీసుకున్న నిర్ణయంతో ధరలు భారీగా పడిపోయాయి. బంగారం ధర అయితే ఏకంగా రూ.7 వేలు తగ్గింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.7,000 లేదా 4.37 శాతం తగ్గి రూ.1,53,300కి దిగొచ్చింది. అంతకుముందు ఇది రూ.1,60,300గా ఉన్నది. ఈ ఏడాది మొదట్లో చారిత్రక గరిష్ఠస్థాయి రూ.1.83 లక్షలకు చేరుకున్న పుత్తడి ధర ప్రస్తుతానికి రూ.29,700 లేదా 16.23 శాతం తగ్గినట్టు అయిందని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. ద్రవ్యోల్బణ భయాలు చుట్టుముట్టనుండటంతో అమెరికా ఫెడ్, బ్యాంక్ ఆఫ్ జపాన్ వంటి సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లు యథాతథ స్థితికి మొగ్గుచూపడం కారణమని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ రీసర్చ్ దిలీప్ పార్మర్ తెలిపారు.




## చెట్టును ఢీకొట్టిన బొలెరో.. ఐదుగురు మృతి

ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాజస్థాన్‌లోని కరౌలిలో కైలా దేవి ఆలయ దర్శనం చేసుకుని తిరిగి వస్తున్న భక్తుల బొలెరో కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇటావాకు చెందిన మాజీ సైనికుడు కామ్తా ప్రసాద్, అతని చిన్న కుమారుడు దేవేంద్ర, కోడలు సీమ, ప్రతాపుర నివాసి దేవతే రిషి, కుమారుడు చరణ్ సింగ్, మూడేళ్ల ఆరాధ్య, కుమార్తె నీరజ్ సహా ఐదుగురు భక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆదిత్య, రోష్ని, రిషబ్ గా గుర్తించారు.

# రూ.3,24,234 కోట్లతో తెలంగాణ బడ్జెట్

### ప్రవేశపెట్టిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్ 2026-27ని అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగాన్ని చేపట్టారు. వివిధ రంగాలకు కేటాయింపులు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అన్ని అంశాలపై ప్రసంగించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో, తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (GSDP) ప్రస్తుత ధరల ప్రకారం 17 లక్షల 82 వేల 198 కోట్ల (17,82,198 కోట్లు) రూపాయలు ఉందనీ... గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధిరేటు 10.7 శాతంగా నమోదు అయ్యిందని మంత్రి తెలిపారు. అలాగే.. దేశ GDP 3 కోట్ల 57 లక్షల 13 వేల 886 కోట్ల (3,57,13,886 కోట్లు) రూపాయలు కాగా, వృద్ధిరేటు 8 శాతంగా ఉందని వివరించారు. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉందనీ. అదే విధంగా దేశ GDPలో రాష్ట్ర GSDP 5.0 శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా తెలంగాణ నిలుస్తోందని మంత్రి తెలిపారు. మూసీ నది పునరుద్ధరణ: "మూసీ నది పునరుద్ధరణ కోసం 55 కి.మీ పరిధిలో భారీ అభివృద్ధి ప్రణాళిక చేపడుతున్నాము. ఈ ప్రాజెక్టు మొదటి దశ ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు ఉంటుంది. ఈ మూసీ పునరుద్ధరణలో భాగంగా గోదావరి ప్రాజెక్టు ద్వారా 2.5 TMC ల నీరు మూసీకి అందించబడుతుంది. 45 STP లు ఇప్పటికే పని చేస్తుండగా, అదనంగా మరో 39 STPలు మంజూరు చేయగా, అవి వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. ఈసీ మరియు మూసీ నదుల సంగమ ప్రదేశంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మక గాంధీ సరోవర్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తోంది. ఇందులో నదిని శుభ్రపరిచే పనులు, వరద నియంత్రణ, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, ప్రజలకు వినోద సదుపాయాలు ఏర్పాటు చేయడం ఉన్నాయి. మూసీనది బఫర్ జోన్ లో ఉన్న ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మానవీయ కోణంలో వారికి పునరావాసం కల్పిస్తాము. మా ప్రభుత్వం హైదరాబాద్ మరియు హైదరాబాద్ చుట్టు ప్రక్కల వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి వివిధ సంస్థల ద్వారా సుమారు 43 వేల 592 కోట్ల 88 లక్షల రూపాయల పనులను మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 24,752 కోట్ల రూపాయల పనులు ప్రారంభమయ్యాయి. మిగిలినవి త్వరలోనే చేపడుతాం. ఈ బడ్జెట్లో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖకు 17,907 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నాము" అని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క తన బడ్జెట్ సమావేశంలో తెలిపారు.

**6 గ్యారంటీలకు 50,713కోట్లు కేటాయింపు..**

రైతు భరోసాకు రూ.18,000 కోట్లు
చేయూతకు రూ.14,861 కోట్లు
ఇందిరమ్మ ఇండ్లకు రూ.5,500 కోట్లు
మహాలక్ష్మికి రూ.4,305 కోట్లు
సన్న వడ్ల బోనస్‌కు రూ.3,500 కోట్లు
గృహ జ్యోతి (200 యూనిట్లు ఉచిత విద్యుత్) రూ.2,080 కోట్లు
రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.1,143 కోట్లు
మహాలక్ష్మి పథకం కింద LPG సబ్సిడీ రూ.723 కోట్లు

**బడ్జెట్ కేటాయింపుల వివరాలివే..**

శాంతి భద్రతలు - రూ.11,907 కోట్లు
గోదావరి పుష్కరాలు - రూ.500 కోట్లు
పర్యాటక శాఖ - రూ.1,224 కోట్లు
రాజీవ్ యువ వికాసం - రూ.6వేల కోట్లు
గృహ నిర్మాణం - రూ.7,430 కోట్లు
ఐటీ రంగం - రూ.875 కోట్లు
పరిశ్రమలు - రూ.3,490 కోట్లు
చేనేత - రూ.258 కోట్లు

**తెలంగాణ అసెంబ్లీ వాయిదా**

ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం తర్వాత.. అసెంబ్లీ సోమవారానికి వాయిదా పడింది. మొత్తంగా కొన్ని పథఖాలు, కొన్ని కొత్త నిర్ణయాలతో మంత్రి ప్రసంగం సాగింది. మొత్తం గంట 50 నిమిషాలపాటూ ఆయన ప్రసంగం సాగింది. మధ్యలో అరగంటపాటూ.. ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. అయినప్పటికీ మంత్రి తన ప్రసంగాన్ని ఆపకుండా కొనసాగించారు. ప్రతిపక్షాలు మాత్రం బడ్జెట్ అంతా మోసం అని విమర్శించాయి.

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి - రూ.33,688 కోట్లు
సాగునీటి ప్రాజెక్టులు - రూ.22,615 కోట్లు
రవాణా శాఖ - రూ.12,759 కోట్లు
న్యాయ శాఖ - రూ.2,367 కోట్లు
పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ - రూ.17,907కోట్లు

**బడ్జెట్ కేటాయింపుల వివరాలివే..**

రైతు సంక్షేమం- రూ.23,179కోట్లు
సివిల్ సప్లయ్-రూ.7,366 కోట్లు
పశుసంవర్ధక శాఖ - రూ.1,529 కోట్లు
విద్యుత్ - రూ.21,285 కోట్లు
విద్యా శాఖ - రూ.26,674 కోట్లు
వైద్యం - రూ.13,679కోట్లు
కార్మికుల సంక్షేమం - రూ.999 కోట్లు
మహిళా శిశు సంక్షేమం - రూ.3,143 కోట్లు
ఎస్సీ సంక్షేమం - రూ.11,784 కోట్లు
ఎస్టీ సంక్షేమం - రూ.7,937కోట్లు
బీసీ సంక్షేమం - రూ.12,511 కోట్లు
మైనారిటీ సంక్షేమం - రూ.3,769 కోట్లు

**తెలంగాణ బడ్జెట్ - కేటాయింపుల వివరాలు..**

పంచాయతీరాజ్ రోడ్లకు రూ.2,062 కోట్లు
రోడ్లు భవనాల శాఖకు రూ.6,416 కోట్లు
హ్యామ్ రోడ్లకు రూ.3,053 కోట్లు
రీజనల్ రింగ్ రోడ్డుకు రూ1,525 కోట్లు
రాజీవ్ యువ వికాసానికి రూ.5,800 కోట్లు
ఎస్సీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు రూ.1,500 కోట్లు.



## మెస్సీ @900

అర్జెంటీనా ఫుట్‌బాల్ దిగ్గజం లియోనల్ మెస్సీకి మరో రికార్డు దాసోహమైంది. తన అద్భుత ఆటతీరుతో ఇప్పటికే లెక్కకు మిక్కిలి రికార్డులు తన పేరిట లిఖించుకున్న మెస్సీ తాజాగా మరో ఘనత దక్కించుకున్నాడు. సీవోఎన్‌సీఏసీఏఎఫ్ చాంపియన్స్ టోర్నీలో భాగంగా నాశ్‌విల్లేతో జరిగిన పోరులో ఇంటర్‌మియామి తరఫున బరిలోకి దిగిన మెస్సీ తన కెరీర్‌లో 900 గోల్స్ చేశాడు. మ్యాచ్ మొదలైన ఏడో నిమిషంలోనే మెస్సీ.. ప్రత్యర్థి డిఫెండర్లను ఏమారుస్తూ బంతిని చాకచక్యంగా పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకుంటూ కండ్లు చెదిరే రీతిలో గోల్ కొట్టాడు. తద్వారా క్లబ్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో ఓవరాల్‌గా 900 గోల్ మార్క్ అందుకున్నాడు.

## కోహ్లీ 339 పరుగులు చేస్తే ఐపీఎల్‌లో 9 వేల పరుగుల క్లబ్‌లోకి



మార్చి 28 నుంచి ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఆరంభ మ్యాచ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య జరగనుంది. కాగా.. ఈ సీజన్ ప్రారంభానికి ముందు కోహ్లీని ఓ అరుదైన ఘనత ఊరిస్తోంది. ఈ సీజన్‌లో కోహ్లీ 339 పరుగులు సాధిస్తే ఐపీఎల్‌లో 9వేల పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. ఈ ఘనత సాధించిన ఏకైక ఆటగాడిగా చరిత్ర సృష్టిస్తాడు. ఐపీఎల్ ఆరంభ ఎడిషన్ అయిన 2008 నుంచి కోహ్లీ ఆడుతూ ఉన్నాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతడు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇప్పటి వరకు కోహ్లీ 267 ఐపీఎల్ మ్యాచ్‌లను ఆడాడు. 39.5 సగటు 132.86 స్ట్రైక్ రేట్‌తో 8661 పరుగులు సాధించాడు. ఇందులో 8 సెంచరీలు, 63 అర్థసెంచరీలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 113 పరుగులు. గత మూడు సీజన్లుగా విరాట్ కోహ్లీ సగటు 53 కు పైనే ఉంది. 2023లో 53.25 సగటుతో 639 పరుగులు, 2024లో 61.75 సగటుతో 741 పరుగులు, 2025లో 54.75 సగటుతో 657 పరుగులు సాధించాడు. ఈ లెక్కన చూసుకుంటే 9వేల పరుగుల మైలురాయిని ఈ సీజన్ మధ్యలోనే కోహ్లీ అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇదిలా ఉంటే.. ఐపీఎల్ లీగ్‌లో 8000 పరుగులు సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్ కూడా కోహ్లీనే కావడం గమనార్హం. ఇక రోహిత్ శర్మ 7046 పరుగులతో ఈ లీగ్‌లో అత్యధిక పరుగులు సాధించిన జాబితాలో కోహ్లీ తరువాతి స్థానంలో ఉన్నాడు.

## సేఫ్ జోన్‌లో భారత్: కిషన్ రెడ్డి



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆధ్యాత్మిక, అభివృద్ధితో పాటు శాంతిబాటలో నడుస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది సందర్భంగా స్వామివారి ఆశీస్సుల కోసం వచ్చినట్లు తెలిపారు. ప్రపంచం మొత్తం యుద్ధభూమిలో ఉంటే భారతదేశం మాత్రం ప్రధాని మోదీ నాయకత్వంలో సేవ్ జోన్‌లో ఉందని అన్నారు.

## జీవన్‌రెడ్డి దారెటు?



కాంగ్రెస్‌లో ఉండలేరు. ఇది కన్ఫామ్. ఆ పార్టీకి గుడ్‌బై చెప్పాలని కూడా డిసైడ్ అయ్యారు. బట్ రాజీనామా ప్రకటన ఒక్కటే లేటు అన్నట్లుగా సస్పెన్స్‌ను కంటిన్యూ చేస్తున్నారు మాజీమంత్రి జీవన్‌రెడ్డి. అయితే కాంగ్రెస్‌కు కటీఫ్ చెప్పి కారెక్కుతారా? లేక కమలం గూటికి చేరుతారా? అనేది మాత్రం క్లారిటీ ఇవ్వడం లేదు. కానీ ఆ రెండు పార్టీలు జీవన్‌రెడ్డికి కండువా కప్పేందుకు రెడీగా ఉన్నాయట. జగిత్యాల పొలిటికల్ జంక్షన్‌లో నిలబడిన జీవన్ రెడ్డి దారెటు? నాలుగు దశాబ్దాలకుపైగా హస్తం పార్టీతో ఉన్న అనుబంధాన్ని తెంపుకునేందుకు సిద్ధమవుతున్నారు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీమంత్రి జీవన్ రెడ్డి. కొన్నాళ్లుగా అధికార పార్టీలో అసంతృప్తి రాగం వినిపిస్తూ వస్తున్న ఆయన తీరు ఇప్పుడు స్టేట్ పాలిటిక్స్‌లో చర్చకు దారితీస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన అసంతృప్తి ఎక్కువైంది. ఇతర పార్టీ నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి దక్కింది. ఎమ్మెల్సీ పదవీకాలం ఉన్నప్పటికీ కూడా తనకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదనేది జీవన్ రెడ్డి ప్రశ్న. సేమ్‌టైమ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంజయ్‌ను చేర్చుకోవడం..తన ప్రత్యర్థి అయిన సంజయ్‌కి ప్రయారిటీ ఇవ్వడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోతున్నారు. అందుకే ఇక విలువ లేని చోట ఉండటం ఎందుకంటూ కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పాలని నిర్ణయం తీసుకున్నారట జీవన్‌రెడ్డి. ఈ క్రమంలోనే ఎలాగైనా జీవన్‌రెడ్డిను పార్టీలోకి తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట అరవింద్. జీవన్‌రెడ్డి చేరిక కోసం బీజేపీ రాష్ట్ర నాయకత్వంతో చర్చలు కూడా జరుపుతున్నారట. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ పొలిటీషియన్ వస్తే పార్టీ బలం మరింత పెరిగే అవకాశాలు ఉంటాయనేది అరవింద్ వాదనగా చెబుతున్నారు. అయితే హిందుత్వ పార్టీగా పేరున్న బీజేపీలో చేరితే..ముస్లిం ఓటు బ్యాంకు దూరమవుతుందని ఆలోచనలో జీవన్ రెడ్డి ఉన్నారట. గులాబీ పార్టీ ఆకర్షిస్తోంది. కమలం పిలుస్తోంది. మరి జీవన్‌రెడ్డి కారెక్కుతారా? కమలంతో దోస్తీ కడతారా? అనే చర్చ జరుగుతున్న టైమ్‌లో పార్టీ మారొద్దంటూ కాంగ్రెస్ అధిష్టానం రంగంలోకి దిగింది. జీవన్‌రెడ్డి పార్టీ మారితే కాంగ్రెస్‌కు నష్టమంటూ ముఖ్యనేతలు అధిష్టానానికి వివరించారట. దీంతో మీనాక్షి నటరాజన్..జీవన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేసినా ససేమీరా అన్నారట. కాంగ్రెస్‌ను వీడాక..ఏ పార్టీలో అడుగుపెడితే- - - పొలిటికల్ ఫ్యూచర్ బాగుంటుందనేది ఎటూ తేల్చుకోలేక ఊగిసలాడుతున్నారట జీవన్‌రెడ్డి. భవిష్యత్ రాజకీయ పరిణామాలు..పొడిచే పొత్తులు తన పొలిటికల్ కెరీర్‌కు నష్టం చేయకుండా ఉండేలా వ్యూహాలు రచిస్తున్నారట. అయితే సొంత పార్టీపై గుస్సాగా ఉన్న జీవన్ రెడ్డి.. బుజ్జగింపులకు కాంగ్రెస్‌లోనే సర్దుకుపోతారా? లేక బీఆర్ఎస్, బీజేపీలో ఏ పార్టీలోకి వెళ్తారనేది మరో నాలుగైదు రోజుల్లోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# న్యూక్లియర్ వార్ ప్రమాదం ఎంత నిజం?

## ఇండియా vs పాకిస్థాన్

భారత్—పాకిస్థాన్ మధ్య సంబంధాలు ఇంకా ఉద్రిక్తంగానే కొనసాగుతున్నాయని అమెరికా నిఘా సంస్థలు విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ఉగ్రవాద దాడులు, సరిహద్దు వివాదాలు, అలాగే పాకిస్థాన్ క్షిపణి సాంకేతికతలో జరుగుతున్న పురోగతి వంటి అంశాలు అణు యుద్ధ ముప్పును పెంచే అవకాశమున్నట్లు ఇందులో పేర్కొన్నారు. దక్షిణాసియా పరిస్థితులపై రూపొందించిన ఈ నివేదిక ప్రకారం, భారత్—పాకిస్థాన్ సంబంధాలు ప్రస్తుతం అత్యంత సున్నిత దశలో ఉన్నాయని హెచ్చరించారు. చిన్నపాటి సంఘటన కూడా పెద్ద స్థాయి ఘర్షణకు దారితీసే ప్రమాదం ఉందని, ముఖ్యంగా రెండు దేశాలు అణ్వాయుధ శక్తులు కావడం పరిస్థితిని మరింత ఆందోళనకరంగా మారుస్తోందని తెలిపారు.నివేదికలో ఉగ్రవాద ముప్పును ప్రధాన సమస్యగా గుర్తించారు. భారత్, పాకిస్థాన్ నేరుగా యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పినా, ఉగ్రవాద సంస్థల కార్యకలాపాలు ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయని విశ్లేషించారు. ముఖ్యంగా జమ్మూ కాశ్మీర్ ప్రాంతంలో జరిగే దాడులు ఇప్పటికే పరిస్థితిని తీవ్రతరం చేశాయని, భవిష్యత్తులో మరో పెద్ద దాడి జరిగితే అది రెండు దేశాలను ప్రత్యక్ష యుద్ధానికి నెట్టే అవకాశముందని పేర్కొన్నారు. ఉగ్రవాద గ్రూపులు ఇంకా చురుకుగా పనిచేస్తూ, సంబంధాలను దెబ్బతీసే దాడులకు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఇక పాకిస్థాన్ క్షిపణి సామర్థ్యం కూడా వేగంగా పెరుగుతోందని నివేదికలో ప్రస్తావించారు. ఆధునిక క్షిపణి సాంకేతికతపై పాకిస్థాన్ దృష్టి సారిస్తున్నదని, ఇదే వేగం కొనసాగితే భవిష్యత్తులో ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులను అభివృద్ధి చేసే అవకాశముందని హెచ్చరించారు.ఆఫ్ఘనిస్థాన్ ప్రాంతంలో కార్యకలాపాలు కొనసాగిస్తున్న ISIS-K గురించిన ఆందోళనలను కూడా నివేదిక వ్యక్తం చేసింది. తాలిబన్లు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, ఈ గ్రూప్ ముప్పు పూర్తిగా తగ్గలేదని, అంతర్జాతీయ స్థాయిలో దాడులు చేసే సామర్థ్యం ఇంకా ఉన్నదని తెలిపింది. అదేవిధంగా, పాకిస్థాన్ మరియు తాలిబన్ల మధ్య సంబంధాలు కూడా ఇటీవల కాలంలో దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. సరిహద్దు వద్ద తరచుగా ఘర్షణలు జరుగుతుండటం, వైమానిక దాడులు మరియు ప్రతిదాడులు పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చాయని వెల్లడించారు. ఈ పరిణామాలు ప్రాంతీయ స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.మొత్తంగా, ప్రస్తుతం భారత్—పాకిస్థాన్ నేరుగా యుద్ధాన్ని నివారించాలనే వైఖరిని కొనసాగిస్తున్నప్పటికీ, ఉగ్రవాదం, సరిహద్దు ఉద్రిక్తతలు, క్షిపణి అభివృద్ధి




వంటి అంశాలు భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులకు దారితీసే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం .. ముగ్గురు యువకుల మృతి

అన్నమయ్య జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కురుబలకోట మండల పరిధిలోని సర్కారుతోపు సమీపంలో నిన్న రాత్రి ఈ విషాద ఘటన జరిగింది. అతి వేగం, అజాగ్రత్త మూడు కుటుంబాల్లో తీరని శోకాన్ని నింపాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బి.కొత్తకోటకు చెందిన సురేంద్ర, మదనపల్లికి చెందిన మాధవ, మహేశ్ అనే ముగ్గురు యువకులు స్నేహితులు. గురువారం రాత్రి పని నిమిత్తం మదనపల్లికి వచ్చి, తిరిగి తమ ఇళ్లకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో మదనపల్లి పట్టణ శివారులోని అమ్మచెరువుమిట్ట దాటిన తర్వాత జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపుతప్పింది.

# వాహనదారులకు బిగ్ అలర్ట్

## చలాన్లు చెల్లించకపోతే ఇక ఇబ్బందులే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ ఫ్రీజ్

తెలంగాణలోని వాహనదారులకు అలర్ట్.. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను సీరియస్‌గా తీసుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ చలాన్ల వసూలు, వివాదాల పరిష్కారంకోసం విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఏడాదికి ఐదు కంటే ఎక్కువ చలాన్లు ఉంటే డ్రైవింగ్ లైసెన్స్ లేదా ఆర్సీ ఫ్రీజ్ చేయాలని నిర్ణయించింది. కేంద్ర మోటార్ వాహన నిబంధనలకు అనుగుణంగా జరిమానాలపై వచ్చే అభ్యంతరాలను వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్ రెడ్రెసల్ అథారిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ మరికొద్ది రోజుల్లోనే వెలువడనున్నట్లు రవాణాశాఖ వర్గాల నుంచి సమాచారం. ఈ కొత్త విధానం ప్రకారం.. ట్రాఫిక్ చలాన్లపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాహనదారులు ఆఫ్‌లైన్ దరఖాస్తులకు అవకాశం ఉండదు. కేవలం ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే తమ ఫిర్యాదులను నమోదు చేయాల్సి ఉంటుంది. చలాన్ల జారీ, పరిష్కారం ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన కాలపరిమితిని నిర్ణయించింది. కెమెరా ఆధారిత




చలాన్లను మూడు రోజుల్లోగా, మాన్యువల్ చలాన్లను 15రోజుల్లోగా వాహనదారులకు పంపాలి. చలాన్ అందిన 45 రోజుల్లోపు వాహనదారుడు జరిమానా చెల్లించాలి లేదంటే అభ్యంతరాన్ని దాఖలు చేయాలి. ఫిర్యాదు అందిన 30 రోజుల్లోపు అధికారులు తమ నిర్ణయాన్ని వెల్లడిస్తారు. ఒకవేళ అధికారుల నిర్ణయంతో ఏకీభవించకపోతే చలాన్ మొత్తంలో 50 శాతం చెల్లించి కోర్టును ఆశ్రయించే వెసులుబాటు కూడా కల్పించారు. కోర్టు నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి.





## గాడిదలు పెంచితే రూ.50 లక్షలు


దేశంలో గాడిదల సంఖ్య బాగా తగ్గిపోయింది. గాడిదల సంఖ్య ఆందోళనకర పరిస్థితుల్లో ఉంది. ఇలానే వదిలేస్తే అవి అంతరించిపోయే ప్రమాదమూ ఉంది. దీంతో కేంద్రం అలర్ట్ అయ్యింది. దేశంలో క్షీణిస్తున్న గాడిదల సంఖ్యను పెంచేలా గాడిదల పెంపకాన్ని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త స్కీమ్ ప్రకటించింది. గాడిదల పెంపకానికి రూ.50 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తోంది. జాతీయ పశు సంపద మిషన్ కింద ఈ చొరవ తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వనరులను పెంచడం, దేశీయ జాతులను పరిరక్షించడమే ఈ పథకం లక్ష్యం. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ (NLM) కింద గాడిదలు, గుర్రాలు, ఒంటెల పెంపకానికి పారిశ్రామికవేత్తలు, రైతులకు భారీ ఆర్థిక సాయం అందిస్తోంది కేంద్రం. ఈ పథకం ద్వారా గాడిదల పెంపక కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు రూ.50 లక్షల వరకు మూలధన సబ్సిడీ పొందే అవకాశం ఉంది. మొత్తం ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం వరకు సబ్సిడీని గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు అందిస్తుంది. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ కింద పశు సంవర్ధక, పాడి పరిశ్రమ విభాగం.. ఈ పథకానికి సబంధించి మార్గదర్శకాలు జారీ చేసింది.

## ఫేస్‌బుక్‌లో భార్య పోస్ట్.. భయంతో ప్రియుడి దగ్గరికి పంపించేసిన భర్త

భార్య పేస్‌బుక్‌లో పెట్టిన పోస్టు చూసి భర్త వణికిపోయాడు. అంతేకాదు.. ఆమె ఫోన్ గ్యాలరీలో నగ్న ఫొటోలు చూసి కంగుతిన్నాడు. ప్రియుడితో తిరుగుతున్నట్లు గుర్తించాడు. ఇంకా.. ఆమెతో కలిసి ఉంటే ప్రియుడితో కలిసి తనను ఎప్పుడైనా చంపేస్తుందన్న భయంతో భర్త ఓ నిర్ణయానికి వచ్చాడు. మధ్యవర్తుల ద్వారా ఎవరితో జీవించాలని అనుకుంటుందో చెప్పాలని సూచించాడు. భర్త నాకు వద్దు.. ప్రియుడితోనే కలిసి ఉంటానని తేల్చి చెప్పడంతో మరోమాట మాట్లాడకుండా భర్త తన భార్యను ప్రియుడి వద్దకు పంపించేశాడు. ఆ తరువాత నేను చావు నుంచి తప్పించుకున్నానంటూ సంతోషపడ్డాడు. ఈ ఘటన యూపీలో చోటు చేసుకుంది. యూపీలోని బులందర్‌షెహర్‌కు చెందిన రాజ్ కుమార్‌కు అదే ప్రాంతానికి చెందిన మహిళతో వివాహమైంది. వారికి ఆరు నెలల పాప కూడా ఉంది. భార్య తరచూ గొడవపడి పుట్టింటికి వెళ్లేది. అక్కడ ప్రియుడితో కలిసి తిరిగేది. అయితే, పలుసార్లు భార్య ప్రవర్తనపై రాజ్‌కుమార్‌కు అనుమానం వచ్చింది. దీంతో భార్యను నిలదీయడంతో నేను ఎవరితోనైనా తిరుగుతున్నాననడానికి సాక్ష్యం ఏమిటి అంటూ ఎదురు ప్రశ్నించింది. పైగా తనను అనుమానిస్తూ ఇబ్బంది పెడుతున్నాడంటూ రాజ్ కుమార్ పైనే ఎదురుదాడి చేసింది. అయితే, ఇటీవల భార్య ఫోన్ చూసిన రాజ్ కుమార్ కంగుతిన్నాడు.








మణిరత్నం, విజయ్, సాయి పల్లవి

## కాంబినేషన్ షురూ!

గత కొన్నాళ్ల నుంచి కోలీవుడ్ లో ఓ ఇంట్రెస్టింగ్ కాంబినేషన్ కోసమే చర్చ నడుస్తోంది. అదే లెజెండరీ దర్శకుడు మణిరత్నం, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి హీరోగా నాచురల్ బ్యూటీ సాయి పల్లవి కాంబినేషన్ అని చెప్పాలి. వీరి కలయికలో సినిమా కోసం ఇన్ని రోజులు అనధికారికం గా వినిపించిన వార్తలు ఇప్పుడు ఫైనల్ గా నిజం అయ్యాయి. మేకర్స్ ఈ క్రేజీ కలయికలో సినిమా ఉందని అఫీషియల్ గా అనౌన్స్ చేయడంతో అభిమానుల్లో మంచి ఉత్కంఠ నెల కొంది. ఇక ఈ సినిమాని మద్రాస్ టాకీస్ వారు అలాగే లైకా ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నట్లు ఖరారు చేసారు. మరి ఈ విలక్షణ కాంబినేషన్ నుంచి ఈ తరహా సిని మా వస్తుంది అనేది వేచి చూడాల్సిం దే. ఇటీవల మణిరత్నం నుంచి వచ్చిన థగ్ లైఫ్ దారుణంగా డిజప్పాయింట్ చేసింది. సో ఈ సిని మా అయినా మెప్పిస్తుందో లేదో చూడాలి.



# కృతి సనన్ హాట్ లుక్స్

ప్రస్తుతం బాలీవుడ్ ఇండస్ట్రీలోని అగ్ర హీరోయిన్లలో ఆమె ఒకరు. తక్కువ సమయంలోనే హిట్ చిత్రాల్లో నటించిన ఈ అమ్మడు.. ఇటీవలే లగ్జరీ పెంట్ హౌస్ కొనుగోలు చేసినట్లు సమాచారం. ఆమె మరెవరో కాదండి.. హీరోయిన్ కృతి సనన్. మిమి సినిమాకుగానూ ఉత్తమ నటిగా జాతీయ చలనచిత్ర అవార్డ్ అందుకుంది. ఈ ఒక్క సినిమా ఆమె కెరీర్ ను మలుపు తిప్పింది. దీంతో హిందీ సినిమా ప్రపంచంలోని స్టార్ హీరోయిన్లలో ఆమె ఒకరిగా నిలిచింది. తాజాగా ఈ అమ్మడు ముంబైలోని నాగరిక పాలి హిల్ ప్రాంతంలో సముద్రానికి ఎదురుగా ఉన్న డ్యూప్లెక్స్ పెంట్‌హౌస్‌ను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. నివేదికల ప్రకారం కృతి సనన్ కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ టవర్‌లోని ఈ లగ్జరీ పెంట్‌హౌస్‌ను రూ. 78.20 కోట్లు అని తెలుస్తోంది. ది ఎకనామిక్ టైమ్స్ ప్రకారం కృతి కొత్త ఇల్లు 14వ , 15వ అంతస్తులలో విస్తరించి ఉంది. ఇది 6,636 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంది. పై అంతస్తుతో పాటు 1,209 చదరపు అడుగుల టెర్రస్ కూడా ఉంటుంది. చదరపు అడుగు ధర దాదాపు రూ. 1.18 లక్షలు.

# సంజూ శాంసన్‌కు గోల్డెన్ ఛాన్స్

ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. ఈ సీజన్ ప్రారంభానికి ముందు సంజూ శాంసన్‌ను ఓ అరుదైన ఘనత ఊరిస్తోంది. ఐపీఎల్ చరిత్రలో 5 వేల పరుగుల మైలురాయిని దాటిన రెండో వికెట్ కీపర్‌గా సంజూ రికార్డులకు ఎక్కనున్నాడు. ఐపీఎల్‌లో 5వేలు, అంతకన్నా ఎక్కువ పరుగులు చేసిన వికెట్ కీపర్ బ్యాటర్ ఎంఎస్ ధోని మాత్రమే. ఐపీఎల్ ఆరంభ సీజన్ అంటే 2008 నుంచి ఆడుతున్న ధోని ఇప్పటి వరకు 278 మ్యాచ్‌లు ఆడాడు. 242 ఇన్నింగ్స్‌ల్లో 38.3 సగటు, 137.4 స్ట్రైక్‌రేటుతో 5439 పరుగులు చేశాడు. ఇక కేఎల్ రాహుల్ కూడా ఐపీఎల్‌లో 5వేల పరుగుల కు పైగా సాధించినప్పటికి కూడా అతడు ఐపీఎల్ కెరీర్‌లో ప్రతి మ్యాచ్‌లో వికెట్ కీపర్‌గా బాధ్యతలను నిర్వర్తించలేదు. ఇక సంజూ శాంసన్




విషయానికి వస్తే.. 2013లో ఐపీఎల్‌లో అరంగ్రేటం చేశాడు. ఇప్పటి వరకు అతడు 177 మ్యాచ్‌లు ఆడాడు. 172 ఇన్నింగ్స్‌ల్లో 30.9 సగటు, 139.1 స్ట్రైక్‌రేటుతో 4704 పరుగులు సాధించాడు. 5వేల పరుగుల క్లబ్‌లో చేరుకునేందుకు సంజూకు మరో 296 పరుగులు అవసరం. టీ20 ప్రపంచకప్‌లో అదరగొట్టిన సంజూ శాంసన్ ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్నాడు. ఇదే ఊపులో ఐపీఎల్‌లో తొలిసారి సీఎస్‌కే తరుపున బరిలోకి దిగబోతున్న అతడు ఆ జట్టులో తనదైన ముద్ర వేయాలని భావిస్తున్నాడు. సంజూ శాంసన్ 2018 నుంచి 2025 వరకు రాజస్థాన్ రాయల్‌స్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2021లో అతడు ఆ జట్టుకు కెప్టెన్ అయ్యాడు. అతడి నాయకత్వంలో ఆర్ఆర్ ఐపీఎల్ 2022 ఫైనల్‌కు చేరుకుంది. కాగా.. ఐపీఎల్ 2025లో ఆ జట్టు పేలవ ప్రదర్శన చేసింది. ఇక ఐపీఎల్ 2026 మెగావేలాని కన్నా ముందు సీఎస్‌కే జట్టుకు ట్రేడింగ్ ద్వారా సంజూ శాంసన్ బదిలీ అయ్యాడు.

## ఎస్‌బీఐ ఏటీఎంలో 10000 విత్‌డ్రా.. బ్యాంక్ ఆఫ్ బరోడాకు 3 లక్షల ఫైన్

ఎస్‌బీఐ ఏటీఎం నుంచి 10 వేల విత్‌డ్రా చేయాలనుకున్నాడు బ్యాంక్ ఆఫ్ బరోడా కస్టమర్. అతను కార్డు పెట్టి, పిన్ ఎంటర్ చేశాడు. ఆ తర్వాత అతనికి పదివేలు డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ ఏటీఎం నుంచి క్యాష్ రాలేదు. దీంతో ఆ వ్యక్తి ఖంగారు పడ్డాడు. బ్యాంక్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అతన్ని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో వినియోగదారుల ఫోరమ్‌కు వెళ్లాడు. అక్కడ కేసులో వాదనలు జరిగాయి. 9 ఏళ్ల తర్వాత సమస్య పరిష్కారమైంది. బ్యాంక్ ఆఫ్ బరోడాకు జరిమానా వేశారు. ఆ కస్టమర్‌కు 3 లక్షలు చెల్లించాలని కన్స్యూమర్ ఫోరమ్ ఆదేశించింది. వివరాల్లోకి వెళ్తే. 2017 ఫిబ్రవరి 18వ తేదీన సూరత్‌లోని ఓ వ్యక్తి ఎస్‌బీఐ ఏటీఎం 10 వేల విత్‌డ్రా కోసం వెళ్లాడు. అతను పిన్ ఎంటర్ చేసిన తర్వాత డబ్బులు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. కానీ నగదు రాలేదు. షాక్‌కు గురైన అతను ఫిబ్రవరి 21వ తేదీన దుంబల్ బ్రాంచ్‌కు వెళ్లాడు. మార్చి నుంచి మే 2017 వరకు అతను తన బ్యాంక్‌కు మెయిల్స్ చేశాడు. ఓ దశలో ఆర్బీఐకి వెళ్లాడు. ఏటీఎం సెంటర్‌లోని సీసీటీవీ ఫూటేజ్‌ను పరిశీలించాలని కూడా అతను ఆర్టీఐ రిక్వెస్ట్ పెట్టుకున్నాడు. కానీ అధికారులు పట్టించుకోలేదు. 2017 డిసెంబర్20వ తేదీన అతను వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించాడు.

